క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘం కార్తీక వన సమారాధన



పెదవేగి కార్తీక వనసమారాధనలో సందడి చేస్తున్న ఆర్య సంఘ సభ్యులు

పెదవేగి : సాంకేతిక యుగంలో ఎవరికివారే అన్నట్టుగా హడావిడి జీవితాలను గడుపుతున్న ప్రజలకు కార్తీకమాసం మానసిక ప్రశాంతతను చేకూర్చుతుందని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అన్నారు. పెదవేగి, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు పెదవేగిలో వన సమారాధన నిర్వహించారు. ఆదివారం ఉదయం ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించి, ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు కొనకళ్ళ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, కందుల బలరామకృష్ణ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీల కార్పొరేషన్ చైర్మన్ సంజీవ్‌కు సన్మానం



ముంగర సంజీవ్‌ను సత్కరిస్తున్న కొఠారు రామచంద్రరావు

దెందులూరు: వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్‌ను ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు శాలువా, బొకేలతో సత్కరించి జ్ఞాపిక అందించారు. చైర్మన్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కొఠారు రామచంద్రరావు రుణం తాను ఎన్నటికీ తీర్చుకోలేనన్నారు. ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్, కొల్లేరు వైఎస్సార్‌సీపీ నాయకులు, కొల్లేరు సంఘ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

లబ్ధిదారులకు పింఛను అందజేత



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో శేషపు తవుట్లు వేలిముద్రను వేయిస్తున్న వలంటీర్ ఝాన్సీ

భీమడోలు: ఏలూరు సర్వజన ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్న వికలాంగునికి వలంటీర్ వైఎస్సార్ పింఛన్ కానుక నగదును ఆదివారం అందించి తమ సేవాదృక్పథాన్ని చాటుకుంది. గుండుగొలనుకి చెందిన విభిన్న ప్రతిభావంతుడు శేషపు తవుట్లుకు కళ్లు కనిపించకపోవడంతో ప్రతి నెల ప్రభుత్వం వికలాంగ పింఛన్ కింద రూ.3వేలను అందిస్తోంది. ఈ క్రమంలో గ్రామ వలంటీర్ ఝాన్సీ అతను తలలో గడ్డలతో బాధపడుతూ అనారోగ్యంతో ఏలూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలుసుకుని ఆమె అక్కడికి వెళ్లి రూ.3వేల పింఛన్ సొమ్ము అందించింది. ఆమెను స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

నేడు సూరప్పగూడెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

భీమడోలు: సూరప్పగూడెంలో ఈనెల 4న సోమవారం సాయంత్రం 4 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం రాత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

ఉంగుటూరు: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మానవత సంస్థ సభ్యులు కైకరంలో ఆదివారం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా రీజినల్ చైర్మన్ పుప్పాల గోపి, మండల అధ్యక్షుడు గంజి రవి, జిల్లా విజిలన్సు అండ్ మోనిటరింగ్ సభ్యుడు కోనె వీరవెంకట సత్యనారాయణ, సంపతి గణేష్ చిన్నం అనిల్, శీతాల సత్యనారాయణ, దివ్యాంగులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు తగిన ప్రోత్సాహం అందించాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ నిర్మలకుమారి అన్నారు. ఆదివారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో క్రీడాకారులకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ క్రీడాదుస్తులను అందజేశారు. దాతలను పలువురు అభినందించారు.

అర్హులందరికీ ఓటుహక్కు

- ఆర్డీవో ఖాజావలి
- ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాల పరిశీలన



గణపవరం: ఓటర్ల నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏలూరు ఆర్డీవో

గణపవరం: ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదులో సిబ్బంది అప్రమత్తతో పనిచేయాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్డీవో ఖాజావలి అన్నారు. ఆదివారం గణపవరంలో పలు ఓటు నమోదు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. తహసీల్దార్ పద్మిలక్ష్మి, ఆర్ఐ, వీఆర్వోలు ఉన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

దెందులూరు: ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధమని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొంది సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి కృపావరం అన్నారు. ఆదివారం తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ భీమరాజు ఆధ్వర్యంలో రెండు రోజుల ఓటు హక్కుపై ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. అన్ని శాఖల మండలాధికారులు, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, బీఎల్వోలు, సీఏలు, డ్వాక్రా మహిళలు మానవహారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఏపీఓ దశరథ రామ్‌జీ, ఏపీఎం వేణుగోపాల్, ఎంఈఓ అన్నమ్మ, హెచ్‌ఎం శర్మ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల నమోదులో 665 దరఖాస్తులు

భీమడోలు: మండలంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ముగింపు రోజైన ఆదివారం ఓటు నమోదుకు దరఖాస్తులు అందాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాలు పోలింగ్ కేంద్రాల వద్ద బూత్‌స్థాయి అధికారులను అందుబాటులో ఉంచింది. ఓట్ల నమోదు, మార్పులు, సవరణలకు దరఖాస్తులను స్వీకరించాలని సంబంధిత అధికారులు ఆదేశాలిచ్చారు. ఈనెల 9వ తేదీ లోగా తమ దరఖాస్తులను బీఎల్వోలకు అందించేందుకు గడువు ఉంది. జనవరి నాటికి 18 ఏళ్లు నిండే యువ ఓటర్లు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనితో తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో రెండు రోజుల్లో 665 దరఖాస్తులు అందాయని రెవెన్యూ అధికారులు చెప్పారు. మండల వ్యాప్తంగా నవంబర్‌లో విడుదల ముసాయిదా ఓటర్ల జాబితాలో 53 పోలింగ్ కేంద్రాల పరిధిలో 51,381 మంది ఓటర్లు ఉండగా జనవరి 5న విడుదల చేసే తుది ప్రచురణ జాబితాల్లో ఓటర్లు పెరగనున్నారు.

పోలింగు కేంద్రాల పరిశీలన

ఉంగుటూరు: ఓటు నమోదు ప్రక్రియను ఏలూరు ఆర్డీవో ఖాజావలి ఆదివారం పరిశీలించారు. రాచూరులోని 46, 47 పోలింగు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఓటు నమోదు వివరాలను బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల డీటీ పోతురాజు వీఆర్వోలు ఉన్నారు.

ఓటరు నమోదుపై అప్రమత్తం

పెదపాడు: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని డీపీఓ శ్రీనివాసవిశ్వనాథ్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరు ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని నాయుడు గూడెంలో ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి బూత్‌స్థాయి అధికారులకు సూచనలు చేసారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొత్త ఓటరు నమోదు ప్రక్రియ శిబిరం ఆదివారంతో ముగిసినా ఈనెల 9తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత తమ పూర్తి వివరాలతో ఫారం 6 సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి సహకారం కావాలన్నా డీపీఓ నంబరు 9849903321 సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు ఎంపీడీవో ఎస్ సూర్యకుమార్, వీఆర్వో శివ బీఎల్ఓ నరేష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

పెదవేగి : కొత్త ఓటరు నమోదు ప్రక్రియను ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ పరిశీలించారు. పెదవేగి మండలంలోని పినకడిమి, అమ్మపాలెం, అంకన్నగూడెం, పెదకడిమి పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం సందర్శించారు. ఆయా గ్రామాల బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.



దెందులూరు: కొవ్వలిలో మానవహారంలో పాల్గొన్న ప్రత్యేకాధికారి కృపావరం, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ భీమరాజు



భీమడోలు: గుండుగొలను పోలింగ్ కేంద్రం వద్ద దరఖాస్తులు స్వీకరిస్తున్న వీఆర్వో కందులపాటి శంకర్



పెదపాడు: ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస విశ్వనాథ్

ఉపాధ్యాయులకు సత్కారం



సూరప్పగూడెంలో చర్చిలో ముగ్గురు టీచర్లను సత్కరించిన గ్రామ కాపరి, పెద్దలు

భీమడోలు: ప్రతి ఒక్కరూ దైవంపై విశ్వాసం కలిగి ఉండాలని సూరప్పగూడెం రక్షణ సైన్యం పాస్టర్ భూపతి అన్నారు. సూరప్పగూడెం రక్షణ సైన్యం చర్చిలో ఆదివారం సూరప్పగూడెంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసి ఇటీవల విలీనమైన ప్రభుత్వ పాఠశాలలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, ఎస్‌జీటీలు ఉచ్చుల సుజాత, చేబత్తిన ఏసుదాసును దుశ్శాలువాలను కప్పి మెమెంటోలను అందించి సన్మానించారు. అనంతరం పండు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు వి.వెంకట్రావు, బి.మధు, బి.ఆదాం, సంఘస్తులు పాల్గొన్నారు.

గంగానమ్మకు జలాభిషేకం



గోపన్నపాలెంలో గంగానమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం చేస్తున్న భక్తులు

దెందులూరు: గోపన్నపాలెంలో ఆదివారం గంగానమ్మ అమ్మవారికి సంబరాలు జరిగాయి. భక్తులు అమ్మవారిని అలంకరించి ప్రదక్షిణలు చేశారు. 108 బిందెలతో జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు తదితరులున్నారు.

తుఫాన్ ప్రభావం.. రైతుల ఆందోళన



గుండుగొలను వద్ద ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న రైతులు



భీమడోలులోని ఓ ఖాళీ స్థలంలో ధాన్యం ఆరబోసిన రైతులు

భీమడోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా పంట మాసూళ్లు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని మిల్లులకు చేరవేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటి రైతులు వరి కోత యంత్రాలతో పంటను కోయడంతో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో ధాన్యాన్ని రోడ్లపై, కళ్లాల్లో, ఖాళీ స్థలాల్లో ఆరబోసుకున్నారు. వాటిని భద్రపర్చుకునేందుకు రైతులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ధాన్యం బస్తాలను బరకాలు, టార్పాలిన్లతో కప్పి భద్రపర్చుకుంటున్నారు. ముంచుకొస్తున్న తుఫాన్ వల్ల రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా అధికార యంత్రాంగం తగు ఏర్పాట్లు చేస్తోంది. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మిల్లులను చేరవేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా 13,786 ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 10వేల ఎకరాల్లో సార్వా పంట మాసూళ్లు పూర్తయ్యాయి. 50 శాతం ఎకరాల్లో పండిన సుమారు 11,262 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. మిగిలిన ధాన్యాన్ని మిల్లులకు చేరవేసేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నామని ఏవో ఎస్‌పీవీ ఉషారాణి ఆదివారం తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని స్పష్టం చేసారు.

ఉపాధ్యాయులు ప్రభుత్వ కృషికి తోడుగా నిలవాలి



నారాయణపురంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ఉంగుటూరు: విద్యకు ప్రభుత్వం వేలకోట్లు వెచ్చించి చేస్తున్న కృషికి ఉపాధ్యాయులు తోడుగా నిలిస్తే మరింత మంచి ఫలితాలు సాధించవచ్చునని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గ్రామాల్లోని పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఆదివారం ఉంగుటూరు మండలం నారాయణపురంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, ఉభయగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా జేపీపీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, ఎన్‌జీవోస్ రాష్ట్ర నాయకులు హరినాథ్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. 400 మంది యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా ముస్తఫా ఆలీ, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, రుద్రాక్షి, గౌరవ అధ్యక్షుడు ఎంవీ శ్యాంబాబు, సహాధ్యక్షులుగా జి.వెంకటేశ్వరరావు, వి. కనకదుర్గ, కోశాధికారిగా జీవీ రంగమోహన్ కార్యదర్శులుగా విక్టర్ అల్లాడిరాజు, పీవీ సాగర్ బాబు, వీరకోటి, పి.శ్రీనివాస్ పి.అనురాధ, ఎస్ రాంబాబు, ఎస్ సుధారాణి, సీహెచ్ శ్రీధర్, జి దేవానంద్ కె. కమల్‌కుమార్, ఎంవీ బేతాళరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా, సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికలకు రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర కార్యదర్శి బి సుభాషిని పరిశీలకులుగా వ్యవహరించారు.

దైవ చింతనతో ప్రశాంతంగా జీవించాలి



పూళ్లలో భవానమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించిన ఆలయ కమిటి నిర్వాహకులు

భీమడోలు: ప్రతి ఒక్కరూ దైవ చింతనతో మెలిగి ప్రశాంత జీవనాన్ని సాగించాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలువేల్పు భవానమ్మ పంట జాతర మహోత్సవంలో భాగంగా శనివారం రాత్రి ఊరడి కార్యక్రమం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మ వారి పుట్టిల్లు వారు పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. ఆలయం వద్ద విద్యుత్ ఆలంకరణతో సుందరంగా ముస్తాబు చేసారు. అమ్మవారి పుట్టింటి గ్రామం పూళ్లలో ప్రతిష్ఠించిన అమ్మవారిని వాసుబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. తొలుత ఆలయ కమిటీ నిర్వాహకులు వాసుబాబుకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఏటా అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ ఉత్సవ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు వాసుబాబు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. సోమవారం అమ్మవారిని సాగనంపే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, మండల ఇన్‌చార్జి పుప్పాల కార్తీక్, ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకట కృష్ణారావు, పెద్దలు పుప్పాల రామ్మోహనరావు, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పులఖండం మధు, కందులపాటి మురళీ, పచ్చా బాబి, పచ్చా వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గణపవరంలో కలుసుకున్న 1975-76 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

గణపవరం: ఐదు దశాబ్దాల అపురూప జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకోవాలని క్షణమొక యుగంగా గడిపిన వారంతా ఆదివారం ఒక చోటచేరి సందడి చేశారు. తమ చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు తెలుసుకుంటూ ఆనందంగా ఉల్లాసంగా గడిపారు. గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో 1975-76లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం ఉదయం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. విద్యార్థులుగా తమ తీపి గుర్తులు పంచుకున్నారు. పదో తరగతి తర్వాత అందరూ వేర్వేరు దారులు ఎంచుకుని, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. వారిలో అనేక మంది ఉద్యోగాల నుంచి రిటైర్డ్‌కాగా, మరికొందరు వ్యాపారాల నుంచి తప్పుకుని ఆ బాధ్యతలు వారసులకు అప్పగించి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆత్మీయ కలియిక సందర్భంగా ఆనాడు తమకు చదువుచెప్పిన గురువులను గౌరవించి, అమరులైన గురువులను, తమ సహ విద్యార్థులను స్మరించుకుని వారికి నివాళులర్పించారు. తమ బ్యాచ్ తరపున కొంత నగదును సేకరించి పాఠశాల వరండాకు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ అపూర్వ కలయికకు కృషి చేసిన తమ సహచర విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జల్లికొమ్మర, మొయ్యేరులో 'గడపగడపకు'

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈనెల 4వ తేదీ సోమవారం గణపవరం మండలం జల్లికొమ్మరలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రూ.45 లక్షల వ్యయంతో జల్‌జీవన్ మిషన్ పథకంలో నిర్మించిన వాటర్‌ట్యాంకు, రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభిస్తారు. 10.30 గంటలకు నిడమర్రులో రూ.43 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనానికి ప్రారంభోత్సవం చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు గణపవరం మండలం మొయ్యేరులో 221వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమాలకు హాజరుకావాలని క్యాంపు కార్యాలయం ప్రతినిధి సుభాష్ కోరారు.

దళితులు ఏకతాటిపైకి రావాలి

ఉంగుటూరు: రాజ్యాంగ బద్ధంగా హక్కుల సాధనకు దళితులంతా ఐక్యతగా ఉండాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ అన్నారు. ఆదివారం బొమ్మిడి గ్రామంలో మాలమహానాడు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గండె నగేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రాజేష్ పాల్గొన్నారు. ఉంగుటూరు మండల ఉపాధ్యక్షుడి మద్దిర రత్నం రాజు నియమించారు. జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్‌బాబు, జిల్లా కార్యదర్శులు గారపాటి నానాజి, నల్లి సంజీవరావు, నరసాపురం డివిజన్ అధ్యక్షుడు గాది రవి, డివిజన్ ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

వన సమారాధనలు ఐక్యతకు దోహదం

ఉంగుటూరు: వన సమారాధనలు ఐక్యతను పెంచుతాయని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం ఉంగుటూరులో మండల విశ్వబ్రాహ్మణుల వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాసుబాబు మాట్లాడుతూ వర్గవైషమ్యాలు విడనాడి అభివృద్ధికి ఐక్యంగా ఉండాలని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, పార్టీ మండల పార్టీ కన్వీనర్ మరడ మంగరావు, నాయకులు దొంతంశెట్టి సత్యనారాయణ, పెనుగొండ బాలకృష్ణ, పార్టీ నాయకులు కార్యకర్తులు పాల్గొన్నారు. కుల పెద్దలు అనుపోజు బ్రహ్మం, రాంపండు తదితరులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కులస్తులు ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించి అనంతరం వన సమారాధనలో పాల్గొన్నారు. నారాయణపురంలో కాళింకులు వన సమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పైడి అరుణకుమార్ తదితరులు ఆధ్వర్యం వహించారు.

ధాన్యం తరలించేందుకు ఆఫ్‌లైన్ సౌకర్యం

దెందులూరు: తుఫాన్ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఆఫ్‌లైన్ సౌకర్యం కల్పించారని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే.సుబ్బారావు అన్నారు. దెందులూరులో ఆయన మాట్లాడుతూ కళ్లాల మీద ఉన్న ధాన్యం రైస్‌మిల్లులకు తరలించేందుకు ఆఫ్‌లైన్ ద్వారా జీపీఎస్‌తో సంబంధం లేకుండా రవాణా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. కళ్లాల్లో ధాన్యం ఉన్న రైతులు త్వరగా ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించుకోవాలని సూచించారు. ఏఓలు, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు, రైతులకు సమాచారాన్ని తెలియజేయాలని జాగ్రత్తలు తీసుకునేలా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సుబ్బారావు సూచించారు.

8న గోపన్నపాలెంలో సెమీక్రిస్మస్

దెందులూరు: గోపన్నపాలెంలో ఈ నెల 8న కల్వరి కృపా మినిస్ట్రీ బ్రదర్ వై.జయకుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఆనందం సెమీ క్రిస్మస్ వేడుకలు పీఈటీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్టు బ్రదర్ జయకుమార్ తెలిపారు. కోసన్న మినిస్ట్రీస్ పాస్టర్ రమేష్, సువార్త గాయకులు జాషువా, పాస్టర్ బీ.యోహాన్ ఈ వేడుకలకు అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. విశ్వాసులు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

మానవత కార్యాలయ భవనం ప్రారంభం

పెదపాడు: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయానికి సొంత భవనాన్ని దాతల సహాయంతో నిర్మించడం మంచి పరిణామమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ రామచంద్రారెడ్డి తెలిపారు. అప్పనవీడులో మానవత కార్యాలయం నూతన భవనాన్ని రామచంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన అప్పనవీడు శాఖ సభ్యుల సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో మానవత సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, కృష్ణా జిల్లా మానవత అధ్యక్షుడు పీ శేషగిరిరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, మారుబోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శివాలయంలో లక్ష బిల్వార్చన

భీమడోలు: శివాలయాలు భక్తులతో ఆదివారం కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. గుండుగొలనులోని దేవదాయధర్మశాఖ పరిధిలోని పార్వతీ సమేత భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసపు పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేసారు. స్వామి వారికి ప్రీతికరమైన లక్ష బిల్వార్చన పూజ, శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.